క్లుప్తంగా

డీఈగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



డీఈ శ్రీనివాసన్ అభినందిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలం ఆర్డబ్ల్యుఎస్ ఏఈగా ఉన్న తానికింటి శ్రీనివాస్ భీమవరం సబ్ డివిజన్ నూతన డీఈగా బాధ్యతలను స్వీకరిస్తున్న సందర్భంగా కాళ్ల మండలం సీపీడబ్ల్యుఎస్ సిబ్బంది శుక్రవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపారు. బొండాడ సీపీడబ్ల్యుఎస్ సిబ్బంది రామారావు, రాకేష్ ,బ్రహ్మాజీ రావు, రాఘవ తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పింఛన్‌కు సర్వర్ కష్టాలు



పింఛన్ కోసం కాళ్ల సచివాలయంలో ఎదురు చూస్తున్న వృద్ధులు

కాళ్ల: పింఛన్లు పంపిణీకి సర్వర్ సమస్య తలెత్తడంతో వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం మొదటి తేదీ కావడంతో పింఛన్లు అందించే ప్రక్రియలో సుమారు 8 గంటల సమయంలో సర్వర్ పనిచేయకపోవడంతో పంపిణీ నిలిపివేశారు. దీంతో వృద్ధులు ఆయా గ్రామాల్లోని సచివాలయాలకు క్యూకట్టారు. సర్వర్ ఇబ్బందుల వల్ల పంపిణీ జరగడం లేదని అధికారులు తెలుపగా, వద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, గంటల తరబడి అక్కడే నిరీక్షించారు. సుమారు 12.30లకు సర్వర్ పనిచేయడంతో పింఛన్ల పంపిణీ చేపట్టారు.

డివైజర్ పనిచేయక కంగారుపడ్డ లబ్ధిదారులు



కాళింగగూడెం గ్రామంలో పింఛన్ కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు

ఆకివీడు: పింఛన్ దారులకు ఒకటో తేదీ పండుగే అయినప్పటికీ కొన్ని కారణాల వల్ల వారు ఆందోళనకు గురవుతున్నారు. ఫించన్ అందజేసే వ్యక్తులు ఇంటికి రాకపోవడంతో తమ పింఛన్ ఆగిపోయిందేమోననే ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. శుక్రవారం ఫించన్ల పంపిణీ ఆరుగంటలకే ప్రారంభమైనప్పటికీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ పలు చోట్ల డివైజర్లు పనిచేయలేదు. దీంతో లబ్దిదారులు తమకు పింఛన్ అందలేదని సచివాలయాల వద్దకు, సిబ్బంది ఇళ్లకు పరుగులు తీశారు. గతంలో తెల్లవారుజామునకే వలంటీర్లు పింఛన్ అందజేయడంతో ప్రశాంతంగా పడుకునే లబ్ధిదారులు కొంత సమయం ఆలస్యం అవ్వడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఆందోళనలు వృద్ధులకు మరింత ప్రమాదకరంగా తయారయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



ఉండిలో అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఉండి: ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం మన కనీస ధర్మమని ఉండి లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు అన్నారు.శుక్రవారం ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్భాగ్యపేదలకు ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండిలోని పలు ప్రాంతాల్లో రోడ్లప్రక్కన ఉండే నిరుపేదలకు ఆహార పొట్లాలను క్లబ్ ప్రతినిధులు అందజేసారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎం శివరామరాజు,పరిపాలనాధికారి రుద్రరాజు నరసరాజు, గొట్టుముక్కల రాము,నంబూరి కాశీ విశ్వేశ్వరరావు,పెన్మత్స రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

పెనుగొండ: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఈ నెల 6వ తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని పెనుగొండ తహసీల్దారు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జి అనితకుమారి తెలిపారు. గడువు ముగిసే సమయానికి ముందుగానే పట్టభద్రులు సంబంధిత తహసీల్దారు, ఎంపీడీవో, మండల విద్యా శాఖాధికారి కార్యాలయాల్లో, నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారని తెలిపారు. పరిశీలనకు అధికారులు వచ్చినపుడు ఆన్‌లైన్ దరఖాస్తులో సంతకం చేయడంతో పాటు డిగ్రీ ధ్రువపత్రం, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు నకళ్లు, కలర్ ఫొటోలతో పాటు, గెజిటెడ్ అధికారి ఇంకు సైడు సంతకంతో అందజేయాలని సూచించారు. అర్హత ఉన్న వారి పేర్లు ఓటర్ జాబితాలో పొందుపర్చనున్నట్టు తెలిపారు.

సోమారామం.. మోక్షధామం

- 2 నుంచి భీమవరం పంచారామక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు
- ఉత్సవాలకు ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు
- సోమేశ్వరుని దర్శించుకునేందుకు తరలిరానున్న భక్తులు



పంచారామక్షేత్రం



శ్రీపార్వతీదేవి అమ్మవారు



శ్రీ అన్నపూర్ణాదేవి అమ్మవారు



శ్రీఉమాసోమేశ్వర స్వామి వారు

భీమవరం(ప్రకాశం చౌక్) : రాష్ట్రంలోని పవిత్రమైన పంచారామ క్షేత్రాల్లో ఒకటి మన భీమవరంలోని శ్రీఉమాసోమేశ్వరజనార్దన స్వామి వారి దేవస్థానం (సోమరామం). ఇక్కడ శ్వేతవర్ణంలో కనిపించే శివలింగం క్రమంగా అమావాస్య వచ్చే సరికి బూడిద లేదా గోధుమ వర్ణానికి మారిపోతుంది. తిరిగి పౌర్ణమి వచ్చేసరికి యథాతదంగా శ్వేతవర్ణంలో కనిపిస్తుంది. చంద్రుడు ప్రతిష్ఠించిన చంద్రశిల కనుక ఈ మార్పులు కలుగుతున్నాయని అంటుంటారు. త్రిపురాసుర సంగ్రామంలో కుమారస్వామి చేత విరుగగొట్టబడిన శివలింగం ముక్కలలో ఒకటి ఇక్కడ పడిందని, అందువలన ఇది పంచారామాలలో ఒకటి అయిందనేది పురాణ కథనం. ఈ ఆలయం రెండు అంతస్తులుగా ఉంటుంది. ఆది దేవుడు సోమేశ్వరుడు కింది అంతస్తులో ఉంటే, అదే గర్భాలయ పైభాగాన ఉన్న రెండో అంతస్తులోని గర్భాలయంలో అన్నపూర్ణాదేవి ఉంటుంది.

కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లు

నవంబర్ 2వ తేదీ నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్తీక మాసోత్సవాల్లో ఈ స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. భక్తుల రద్దీకి తగ్గట్లుగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక క్యూలైన్లు విద్యుత్ అలంకరణ, డెకరేషన్ పనులు జరుగుతున్నాయి. కార్తీక సోమ వారాల్లో 30నుంచి 40వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని అంచనా. భక్తులకు ప్రతి ఏడాది అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగేది. అయితే ఈఏడాది నుంచి దేవస్థానం ఆధ్వర్యంలోనే భక్తులకు అన్నప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు

శ్రీఉమాసోమేశ్వర స్వామి వారికి కార్తీక మాసం నెల రోజులు ప్రత్యేకపూజలు నిర్వహిస్తుంటారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, సాయంత్రం ప్రత్యేక లక్షపత్రిపూజ, ప్రత్యేక అలంకరణ పూజలు జరుగుతాయి. ఆలయంలో గర్భగుడి వెనుక భక్తులు స్వామి వారికి అభిషేకాలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. దేవస్థానంలో కొలువైన శ్రీపార్వతీ దేవి, శ్రీఅన్నపూర్ణదేవి అమ్మవార్లకు ఈ నెల రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. క్షేత్ర పాలకుడు శ్రీజనార్దన స్వామి వారికి, ఆలయంలోని ఉప ఆలయాల్లో కొలువైన వినాయకుడు, కుమారస్వామి, ఆంజ నేయస్వామి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సూర్య భగవాన్, నవ గ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు.

పంచారామ క్షేత్రానికి చేరుకునేది ఇలా

భీమవరం పంచారామక్షేత్రానికి తరలిరావడానికి కి రోడ్డు ప్రయాణం, రైలు ప్రయాణం సౌకర్యం ఉంది. అటు విజయవాడనుంచిగాని ఇటు విశాఖ పట్టణం నుంచి గాని భీమవరానికి రైలు సౌకర్యం ఉంది. భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్‌కు అతి దగ్గరగా ఈ పంచారామక్షేత్రం ఉంటుంది. అలాగే రాష్ట్రంలో ఏప్రాంతం నుంచి అయిన భీమవరానికి బస్సు సౌకర్యం ఉంది. భక్తులు బస్సుల ద్వారా భీమవరం బస్టాండ్‌కు చేరుకుని అక్కడ నుంచి ఆటోలద్వారా పంచారామక్షేత్రానికి చేరుకోవచ్చును. పంచారామక్షేత్రాల యాత్రికులకు ఆర్టీసీ ప్రత్యేకబస్సులు నడుపుతుంది. వాటిద్వారా కూడా పంచారామక్షేత్రానికి చేరుకో వచ్చు. భీమవరం పట్టణంలో మరో శివక్షేత్రం శ్రీభీమేశ్వర స్వామి వారి ఆలయంలో కూడా కార్తీకమాస మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

పాలకోడేరు: అనారోగ్యాన్ని తాళ లేక పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇది. గరగపర్రు కు చెందిన చికిలే గిద్యోని (56) గత కొంతకాలంగా అనారోగ్యంగా ఉంటూ, తట్టుకోలేక శుక్రవారం ఉదయం పదిన్నర గంటల సమయంలో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.మస్థానికులు గుర్తించి సకాలంలో 108 అంబులెన్స్‌లో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి నప్పటికీ చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందినట్లు, కుమార్తె చవాకుల సారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్ఐ రవి వర్మ తెలిపారు.

ఆకాశ దీపంతో ప్రారంభమైన కార్తీక మాసం



మల్లేశ్వరస్వామికి పంచహారతులందిస్తున్న అర్చకుడు లంక జలదుర్గ ప్రసాద్

ఆకివీడు: దేవతలందరినీ ఆహ్వానిస్తున్నట్లు, ప్రకృతిని ఆహ్వానించడం ఆకాశ దీపం మహత్యమని అర్చకులు లంక జలదుర్గా ప్రసాద్ చెప్పారు. శుక్రవారం సాయింత్రం అమావస్య పూర్తి కావడంతో పాడ్యమి రావడంతో కార్తీక మాసం ప్రారంభమైందని తెలిపారు. స్థానిక మాదివాడలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆకాశ దీపం వెలిగించి కార్తీక మాస పూజల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల చేసి, మల్లేశ్వరస్వామికి పంచహారతులు అందజేశారు. మహిళలు అత్యధికంగా పాల్గొన్నారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ పాడ్యమి స్నానాలు శనివారం తెల్లవారుజామున కాలువల్లో చేస్తారని చెప్పారు. కార్తీక మాసం నెల రోజులూ దీపార్చనలు చేయడం ద్వారా ముక్తి లభిస్తుందని నమ్మిక అన్నారు. ప్రతీ రోజూ తెల్లవారుజామున 4 గంటలకు స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేయనున్నట్లు చెప్పారు. పలు శివాలయాల్లో ఆకాశ దీపంలు వెలిగించారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం భీమవరం రానున్నట్లు జిల్లా సమాచార శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారని పేర్కొంది. మధ్యాహ్నం భీమవరం కలెక్టరేట్‌లో అధికారులతో జరిగే సమావేశంలో పాల్గొని వివిధ అంశాలపై సమీక్షిస్తారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాలకోడేరు: మోటారు సైకిల్ పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయిన సంఘటన ఇది. శివదేవుని చిక్కాల నుంచి తాపీ పని నిమిత్తం పులపర్తి శివ కృష్ణ తన స్నేహితుడైన బొక్కా నరసింహారావుతో కలిసి మోటార్ బైక్ పై గొల్లవాని తిప్ప వెళ్తుండగా శుక్రవారం ఉదయం ఎదురుగా భీమవరం వైపు నుంచి కారు ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు బాధితులను భీమవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితులకు ఫిర్యాదు మేరకు వరుణ్‌కుమార్ వర్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవివర్మ తెలిపారు.

పేదలకు నాణ్యమైన సేవలు అందించాలి



మోగల్లు గ్రామంలో రేషన్ షాపు వద్ద మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

పాలకోడేరు: పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా గ్రామంలో ఎన్టీఆర్ భరోసా కింద పంపిణీ చేసే పెన్షన్లను పరిశీలించి ఆ తర్వాత గ్రామంలో 25, 28 నెంబర్ రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ఎల్క్ట్రానిక్ తూకాన్ని పరిశీలించి తూకంలో ఎటువంటి అవకతవకలు జరిగిన సహించేది లేదన్నారు. అంతేకాకుండా పంపిణీలో ఇటువంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన తక్షణం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా చౌక ధరల దుకాణం షాపులో స్టాక్ రూము, రిజిస్టర్ లను ఆయన పరిశీలించారు. స్టాక్ ప్రకారం సరుకు ఉన్నదో లేదో లెక్కించారు. కంది పప్పు, పంచదార రేట్లను సరుకుల బోర్డుపై ఉంచాలన్నారు. పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న బియ్యం, పంచదార, కందిపప్పు వంటి సరుకులు లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేషన్ డీలర్లు, ఎండి యు ఆపరేటర్లు క్రమం తప్పకుండా తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించి వారికి పంపిణీపై ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు, సూచనలు జారీ చేయాలని తహసీల్దార్‌ని ఆదేశించారు. అనంతరం మోగల్లు, కోరుకొల్లు రహదారి పక్కన పోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న వారి ఇంటిని పరిశీలించి ఇంటి పన్ను పడుతున్నారా లేదా అని ప్రశ్నించారు. కట్టడం లేదని అధికారులు సమాధానం ఇవ్వడంతో వారికి లేఅవుట్‌లో స్థలం కేటాయించి తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ నడుంపల్లి భారతి విజయలక్ష్మి, ఎంపీడీవో వి. రెడ్డయ్య, గ్రామ సర్పంచ్ మల్లిపూడి కృష్ణవేణి శ్రీనివాస్, సీవిల్ సప్లై డ్యూటీ జి ఆదిశేషయ్య, వీఆర్వో పి.సురేష్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలకులపై సంఘటిత పోరాటం చేయాలి



భీమవరంలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న కార్మికులు

భీమవరం: కార్మిక చట్టాలు, హక్కులను కాలరాస్తున్న పాలకులపై సంఘటిత పోరాటాలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ వర్కర్స్ కాలనీలో ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మిక జెండాను ఆవిష్కరించిన మాట్లాడారు. స్వాతంత్ర్యం ఉద్యమ సమయంలోనే ఏఐటీయూసీ అధ్వర్యంలో బ్రిటిష్ వారిపై పోరాడి ఎన్నో కార్మిక చట్టాలను సాధించుకున్నామని వాటిని నేటి పాలకులు తుంగలో తొక్కి కార్మికులను రోడ్డుకీడ్చారని ఆందోళన వ్యక్తం చేశారు, అనంతరం కార్మికులకు చాక్లెట్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెల్ల రాము, నీలాపు శ్రీను, రమణ, దుర్గారావు, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ ప్రెసిడెంట్ చిలక రాజ్‌కుమార్, రేవు వెంకటరమణ, జొన్నాడ శివ, చిలకపాటి దైవరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



భీమవరంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని ఆదర్శనగర్‌లో పేద వృద్ధులు, వికలాంగులకు శుక్రవారం దుప్పట్లు, భోజనం ప్యాకెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. మానవతా సంస్థ సభ్యుడు ముదుండి సత్యనారాయణరాజు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో మానవతా సంస్థ భీమవరం మండల శాఖ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజులు మాట్లాడుతూ మానవతా సేవలు అభినందనీయమన్నారు. 80 మంది పేదవృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు, భోజనం, స్వీట్లు, అందించారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, ఉండి వాసు, ఇందుకూరి శివాజీ వర్మ, ముదుండి శైలజ, ప్రవల్లిక, రోహిణి, నితిన్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్లలో స్టాక్ నిల్

పట్టించుకోని అధికారులు



భీమవరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఎటువంటి స్టాక్ లేని దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజలకు తక్కువ ధరలకే కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు అందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లుల్లో ఏస్టాక్ లేదు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ప్రారంభించిన ప్రత్యేక కౌంటర్లు మూడు రోజుల నుంచి ఖాళీగా ఉన్నాయి. కనీసం వారం రోజుల పాటు కూడా పూర్తిస్థాయిల్లో నిత్యవసర సరుకులను ప్రజలకు అందించలేకపోయారు. కౌంటర్లు ప్రారంభించి గొప్పలు చెప్పిన అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు నిత్యవసర సరుకులు అందించడంలో విఫలం అయ్యారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ప్రత్యేక కౌంటర్లుల్లో పూర్తి స్థాయిలో స్టాక్ ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన భాద్యత ఉంది.

దింపు కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

తణుకు అర్బన్: దింపు కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దింపు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం తణుకు కార్మికశాఖ అధికారి బి.లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మంది దింపు కార్మికులు చేతివృత్తులపై ఆధారపడి స్వయం ఉపాధితో వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. దింపు వృత్తి ప్రమాదకరమైనదని, చెట్లు ఎక్కేటప్పుడు దిగేప్పుడు ప్రమాదాలు జరిగి మృత్యువాతపడడం, శాస్వత వికలాంగులుగా మారుతున్న ఘటనలు జరుగుతున్నాయని కావున ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి ఆదుకోవాలని కోరారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు



అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం ఆంధ్రుల చరిత్రలో సువర్ణధ్యాయమని భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సరిపిడకల రామారావు అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, కుక్కల బాల, జానపాటి మధుసూదన్ రావు మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల పోరాటంలో తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమ నేపథ్యంలో పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేపట్టి అమరులై ఆంధ్రరాష్ట్రం సాధించారని, ఆయన త్యాగం అజరామరమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలు ఆంధ్రులనే ప్రతిఒక్కరూ పొట్టిశ్రీరాములు ఋణం తీర్చుకోలేరని, మద్రాసు కాంపోసిట్ స్టేట్లో ఉన్న మన తెలుగువారు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని కోరుకోవటం దానికి పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టడం ఆయన వీర మరణం త్యాగ ఫలితమే ఆంధ్రరాష్ట్ర అవతరణ అని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ సత్యనారాయణ, సాగిరాజు సూర్యనారాయణ రాజు, అల్లూరి చిన బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

త్యాగశీలి పొట్టి శ్రీరాములు

భీమవరం (ప్రకాశంచౌక్): తెలుగువారికి భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పోరాడి ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను అర్పించిన త్యాగశీలి, స్వాతంత్ర సమరయోధుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ సీహెచ్ అప్పారావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పూల మాలలు వేసి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పోరాడిన యోధుడు పొట్టి శ్రీరాములని 56 రోజులపాటు మద్రాసు నగరంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుని ఆత్మ బలిదానం చేసుకుంటే తప్ప కేంద్ర ప్రభుత్వం తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సహాయ సంచాలకులు సంధ్య, మధ్యాహ్న భోజన పథకం కోఆర్డినేటర్ కుక్కల కృష్ణారావు, గుంటపల్లి చిన్నయ్య, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సొంత నిధులతో రోడ్డు పనులు



దొడ్డనపూడిలో రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

కాళ్ల: గోతులమయమైన రోడ్డుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి సర్పంచ్ తన సొంత నిధులతో రోడ్డు మరమ్మతు పనులకు శుక్రవారం పనులు మొదలు పెట్టారు. కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామానికి వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బి రహదారి అడుగుకో గొయ్యి ఏర్పడి ప్రజలు ప్రయాణించడానికి వీలు లేకుండా పోవడంతో గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు సుమారు రూ.3.50 లక్షలు సొంత నిధులతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. పనులను శుక్రవారం మాజీ ఎంపీపీ ఆరేటి తాతాపండు, వార్డు సభ్యులు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్డు పరిస్థితిపై ఆర్అండ్‌బి అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. రోడ్డు నిర్మాణం ఎలా ఉన్నా కనీసం మరమ్మతులు అయినా చేయాలని కోరినా పట్టించుకోకపోవడంతో గ్రామ సర్పంచ్ సుబ్బారావు ముందుకు వచ్చి సొంత నిధులతో మరమ్మతులు పనులకు శ్రీకారం చుట్టారన్నారు. రహదారి ప్రక్కన ఉన్న పొదలను తొలగించడంతో పాటు, వెట్ మిక్స్ కాంక్రీటు రాళ్లతో రహదారిపై ఏర్పడ్డ గోతులను పూడ్చివేత పనులు చేపట్టారు.

విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



అనాకోడేరులోని హైస్కూల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఉపాధ్యాయులు ఎంతో ప్రావీణ్యతతో తయారుచేసిన స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకుని నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయులు బి. వెంకటేశ్వర్లు అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరులోని డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత, తెలుగు ఉపాధ్యాయులు రేపాక వెంకన్నబాబు, ఎస్ ప్రేమరాజు సౌజన్యంతో స్టడీ మెటీరియల్ పుస్తకాలను పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సుంకర పరమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే సత్ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.మెర్సీ కుమారి, ఎన్‌డీవీ ప్రసాద్, ఎంవీ శ్రీలక్ష్మి, డి. అనురాధ, కె. రాజేష్ కుమార్ రాజు, జీఎస్ విజయలక్ష్మీ, సీహెచ్ శ్రీనివాస్, బి రత్నకుమారి, డి. కనకరత్నం, జలాబాయి. వై శకుంతల, ఎమ్ బాల పల్లాల రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.